

శిఖరమంత భక్తి

సత్యసాయి శతజయంతి లోగోను సత్యసాయి విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు కలింపు సాంగ్, అంబర్ తపా ఎవరెస్టు శిఖరం ఆవిష్కరించారు. ప్రశాంతి నిలయంలోని శ్రీసత్యసాయి హయ్యర్ ఇన్‌స్టిట్యూట్‌లో 1990-93 మధ్య బీఎస్సీ, 1993-95 ఎమ్మెస్సీ చదివిన వీరు.. స్వామిపై శిఖరమంత భక్తిని చాటుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



మొంథా మబ్బులు

ఉమ్మడి జిల్లాలో తేలికపాటి వర్షం.. ఆకాశం మేఘావృతం.. చల్లగా వాతావరణం

పంటలను ఆశిస్తున్న చీడపీడలు

మరో ఐదు రోజులు వర్ష సూచన

అనంతపురం అర్బన్/బుక్కరాయసముద్రం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో ఉమ్మడితో ముసురు కమ్ముకుంది. వివిధ ప్రాంతాలలో మంగళవారం చిరు జల్లులు కురిశాయి. తాడిపత్రి, యాడికి, ఉరవకొండ, అనంతపురం, గుంతకల్లు, గుత్తి, విడపనకల్లు, నార్పల, కూడేరు, గార్లదిన్నె, పుట్లూరు, శెట్టూరు మండలాల్లో తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. మిగతా ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై, చల్లటి వాతావరణం నెలకొంది.

14 మండలాల్లో వర్షం

అనంతపురం జిల్లాలోని 14 మండలాల్లో సోమవారం 31 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఉరవకొండలో 8.0 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుంతకల్లు 5.3, రాయదుర్గం 4.5, శెట్టూరు 3.9, బొమ్మనహాళ్ 2.2, బ్రహ్మసముద్రం 2.0, విడపనకల్లు 1.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో ఒక సెంటీమీటరు లోపు వర్షపాతం నమోదైంది. ధర్మవరం మండలంలోని కుణుతూరు వద్ద చెక్ డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. గొల్లపల్లి సమీపంలో వంక నీరు

(మిగతా 6వ పేజీలో...)



ధర్మవరం మండలం కుణుతూరు వద్ద చెక్‌డ్యాం పైనుంచి ప్రవహిస్తున్న వరద



కంట్రోల్ రూం సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

కంట్రోల్ రూం సిబ్బందికి కలెక్టర్ ఆదేశాలు

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. కంట్రోల్ రూంను జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌తో కలిసి మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వాతావరణ శాఖ హెచ్చరికలు, వర్షపాతం, ఎక్కడైనా రోడ్లు దెబ్బతిన్నాయా, చెరువులు, వాగులు, వంకలు ప్రవాహాలు, విద్యుత్ సరఫరాలో అంతరాయం, ప్రాణ, ఆస్తి, పంట, దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి కృషి

రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయింపు

ఏపీ అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు కుమార్ రాజా వర్ల

సమగ్ర సమాచారం లేకపోవడంపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఫైర్



పుట్టపర్తి కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న కమిటీ

పుట్టపర్తి టౌన్/రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సబ్‌ప్లాన్ నిధులతో ఎస్సీల అభివృద్ధికి కృషి చేస్తామని ఏపీ శాసనసభ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు కుమార్ రాజా వర్ల అన్నారు. ఎస్సీల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించిందని తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ఎస్సీ కమిటీ మంగళవారం సమావేశం నిర్వహించింది. కమిటీ సభ్యులు బీఎన్ విజయ్‌కుమార్, కావలి గ్రీష్మ, రోషన్ కుమార్ సొంగ పాల్గొన్నారు. అనంతపురం కలెక్టరేట్‌లో సమావేశానికి ముందు కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్ తదితరులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోలీసు శాఖ పరిధిలో ఎస్సీ అట్రాసిటీ కేసుల వివరాలు, పెండింగ్‌లో ఉన్న వాటి గురించి డీఎస్పీలు వివరించారు. 2009 నుంచి ఓ వ్యక్తి కోర్టుకు హాజరు కావడం లేదని, నాన్‌బెయిలబుల్ వారెంట్ ఉన్నా ఎందుకు పట్టుకోలేదని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రశ్నించారు. ఏడాదిలో అట్రాసిటీ కేసులు, బాధితులకు ఇచ్చిన పరిహారం వివరాలను అడిగారు. పూర్తి వివరాలు లేవని డీఆర్వో మలోల అనడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో మిస్సింగ్ కేసులు ఎన్ని? వాటిలో ఎస్సీలు ఉన్నారా? అని ఎస్పీని (మిగతా 7లో...)

నీటి ఆశలు..!

● పీఏబీఆర్ కుడి కాలువకు విడుదల చేయాలంటున్న రైతులు ● వట్టిపోయిన తాడిమర్రి, బత్తలపల్లి మండలాల చెరువులు



తాడిమర్రి మండలంలో సాగులో ఉన్న చీనీ పంట

చిత్రావతి కుడికాలువ



తాడిమర్రి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడికాలువకు ఈసారైనా నీరు విడుదల చేసి, చెరువులు నింపకపోతారా అని మండల రైతులు ఆశగా చూస్తున్నారు. అసలే వర్షాకాలం, ఇలాంటి సమయంలో భూగర్భజలాలు అభివృద్ధి చెంది రైతులకు అందుబాటులోకి రావాలి. వర్షాకాలం పూర్తి కావస్తున్నా.. తాడిమర్రి, బత్తలపల్లి మండలాల్లోని చెరువులకు నీరు చేరలేదు. దీంతో రైతులు నీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. చెరువులకు నీరందించి, ఆదుకునే దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

గ్రావిటీతో ఇచ్చే అవకాశం ఉన్నా..

తాడిమర్రి, బత్తలపల్లి మండలాల్లో వేల ఎకరాల్లో పండ్లతోటలు సాగవుతున్నాయి. వాటిని కాపాడుకోవాలంటే నీరు కావాలి. తాడిమర్రి మండలం మొత్తానికి అవసరమయ్యే బియ్యం పండించే కునుకుంట్ల, రామాపురం, చిల్లకొండయ్యపల్లి రైతులకు సాగునీరు లేక ఈ ఏడాది వరి నాటడమే గగనమైంది. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం చెరువులకైనా నీరు అందించకుంటే పండ్లతోటల సాగు కూడా కష్టమవుతుందని రైతులు వాపోతున్నారు. కుడికాలువ ద్వారా తాడిమర్రి మండలంలోని పుల్లప్పపల్లి, ఏకపాదంపల్లి, పిన్నదరి, పుల్లానారాయణపల్లి, అగ్రహారం, మేడిమాకులపల్లి, నిడిగల్లు, భీమరాయునిపేట గ్రామాల చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలకు నీరందించాల్సి ఉంది. ఏటా అదిగో ఇస్తాం.. ఇదిగో ఇస్తాం అని చెప్పి చివరిలో ఒక రోజు ఏదో ఒక చెరువుకు నీరు ఇచ్చి చేతులు దులుపుకోవడం అధికారులకు పరిపాటిగా మారింది. ఇప్పటికే ఈ ఏడాది ఎగువప్రాంత రైతులకు అవసరమైన నీరు కాలువలు, వర్షాల ద్వారా సమకూరింది. దిగువ ప్రాంత రైతులు నీటి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అధికారులు అలసత్వం వహిస్తే రైతులకు ఇబ్బందులు తప్పవు. ప్రస్తుతం తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌కు నీరు వదులుతున్నారు. ఆ నీరు చాగల్లురిజర్వాయర్‌కు, అటు నుంచి గండికోటకు వెళ్తాయి. గండికోట నుంచి లిఫ్టుల ద్వారా తాడిమర్రి మండల సరిహద్దులోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తారు. ఇందుకు విద్యుత్ బిల్లులు రూ.కోట్లలో చెల్లించాల్సి ఉంటుంది. పీఏబీఆర్ కుడికాలువ ద్వారా ఖర్చు లేకుండా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు గ్రావిటీ ద్వారా నీటిని తరలించవచ్చు. ఆ దిశగా అధికారులు ఆలోచన చేయకపోవడం శోచనీయం.

నీటి కోసం నిత్యం సమరమే..



నీటి కోసం నిత్యం ఎదురుచూడాల్సి వస్తోంది. ఈ సీజన్‌లో వర్షపు నీరు చెరువులు, కుంటలకు చేరకపోతే వచ్చే వేసవికి తీవ్ర కరువు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అధికారులు చెరువులకు నీరిస్తే ఆ గండం తప్పుతుంది.

- ప్రతాప్, రైతు, ఏకపాదంపల్లి

తూర్పు చెరువుకు ఎప్పుడూ అన్యాయమే



పీఏబీఆర్ కుడికాలువ ద్వారా చివరి చెరువులకు ముందుగా నీరు ఇస్తామని చెబుతారే తప్ప.. ఎన్నడూ అమలు చేయలేదు. కాలువ నిర్మాణం పూర్తయినప్పట్నుంచి తాడిమర్రి తూర్పుచెరువుకు రెండుసార్లు మాత్రమే నీరు చేరింది. చెరువుకు నీరు వస్తే తాడిమర్రి, మొదుగులకుంట, బంగారంపేట, చిల్లకొండయ్యపల్లి, మద్దెల చెరువు, కునుకుంట్ల గ్రామాల్లో భూగర్భ జలమట్టం పెరిగి సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవు.

-చలపతి, రైతు, తాడిమర్రి

పైపైకి ధరలు

టమోటా రైతుల్లో ఆనందం.. కొనసాగితే లాభాలేనంటున్న అన్నదాతలు



మార్కెట్‌కు తరలించడానికి టమోటాలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

తనకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు టమోటా ధరలు పెరుగుతున్నాయి. దీంతో టమోటా రైతుల్లో ఓ వైపు ఆనందం మరోవైపు ఆవేదన వ్యక్తం అవుతున్నాయి. వారం రోజులుగా ఎడతెరిపి లేని వర్షాల వల్ల టమోటా పంటకు మచ్చ, తెగుళ్ల వ్యాపించాయి. దీంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలలో వర్షాల కారణంగా టమోటా పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు రైతులు అంటున్నారు. తనకల్లు మండలంలో సీజన్‌తో సంబంధం లేకుండా ఏ సమయంలో చూసినా 2వేల ఎకరాలకు తక్కువ కాకుండా టమోటా పంట సాగులో ఉంటుంది. ఈ పంట సాగు చేయడానికి ఎరువులు, నారు, కూలీలు, కట్టెలు, డ్రిప్ ఎరువులు, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల కోసం ఎకరానికి రూ. 1.5 లక్షల నుంచి 1.80లక్షల దాకా ఖర్చు చేస్తారు. ఇటీవల టమోటా ధరలు కొంత తగ్గినా వర్షాల వల్ల తిరిగి పుంజుకున్నాయి. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలోని చింతామణి, వడ్డిపల్లి మార్కెట్‌లలో 15 కిలోల బాక్సు ధర రూ.350 నుంచి రూ.400 దాకా పలుకుతున్నట్లు రైతులు తెలిపారు. అన్నమయ్య జిల్లా మొలకలచెరువు, అంగళ్లు, మదనపల్లి మార్కెట్‌లో 30 కిలోల బాక్సు ధర రూ.550 నుంచి రూ.700 దాకా ఉన్నట్లు వివరించారు. ధరలు ఇలాగే కొనసాగితే ఖర్చులు పోను ఎకరానికి రూ.లక్ష నుంచి రెండు లక్షల దాకా ఆదాయం వస్తుందని రైతులు అంచనాలు వేస్తున్నారు.



టమోటాలను కోస్తున్న కూలీలు

గిట్టుబాటు అవుతుంది



టమోటా ధరలు ఇలాగే కొనసాగితే రైతులకు గిట్టుబాటు అవుతుంది. నేను మూడు ఎకరాలలో టమోటా పంట సాగు చేశా. వర్షం కారణంగా టమోటాలకు మచ్చలు వస్తున్నాయి. ప్రస్తుతం ప్రతి రోజు ధరలు పైపైకి పెరుగుతున్నాయి. ఇది మరింత కాలం కొనసాగితే రైతులకు మంచి ఆదాయం లభిస్తుంది.

- సుధాకర్‌రెడ్డి, రైతు, కొత్తకురువపల్లి

రైతులకు లాభం



ప్రస్తుతం ఉన్న ధరలు టమోటా పంట సాగులో ఉన్న రైతులకు లాభదాయకంగా ఉన్నాయి. ఖర్చులు పోను ఎకరానికి రూ. 1.5 లక్షల నుంచి రూ. 2లక్షల దాకా ఆదాయం వస్తుంది. వర్షాల వల్ల ఇతర ప్రాంతాలలో టమోటా పంటలు దెబ్బతినడంతోనే ప్రతి రోజు మార్కెట్ లో టమోటా ధరలు పెరుగుతున్నాయి. టమోటా పంట ఏడాది పొడవునా సాగు చేస్తే ఏదో ఒక సందర్భంలో తప్పకుండా మంచి ధర వస్తుంది.

- సూర్యనారాయనరెడ్డి, రైతు, పెద్దకడపలవారిపల్లి

రైతుల ఆదాయాన్ని పెంచాలి

● పీఎండీడీకేపై

నోడల్ అధికారి సిద్ధార్థ్ జైన్



అధికారులతో మాట్లాడుతున్న సిద్ధార్థ్, కలెక్టర్, జేసీ

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా నోడల్ అధికారి సిద్ధార్థ్ జైన్ ఆదేశించారు. పథకం అమలు గురించి కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. పథకం గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో జేసీ మౌర్య భరద్వాజ్, డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి రాము నాయక్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ అధికారి సుదర్శన్, ఇరిగేషన్ అధికారి గురుమూర్తి, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, నాబార్డు అధికారి అనూరాధ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాలపరిమితి పొడిగింపు

కొత్తచెరువు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు వ్యవసాయ సహకార పరపతి సంఘాల కాల పరిమితిని వచ్చే ఏడాది జనవరి 30 వరకూ పొడగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కనగానిపల్లి, పుట్టపర్తి, బత్తలపల్లి, తాడిమర్రి సహకార సంఘాలకు ప్రస్తుతం ఉన్న నాన్ అఫీషియల్ పీఐసీ కమిటీని కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. ముదిగుబ్బ పీఏసీఎస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లుగా వైవన్నూర్ స్వామి, బి.జనార్దన్‌ను, రాళ్ల అనంతపురం సహకార సంఘానికి జూనియర్ ఇన్‌స్పెక్టర్ సి.రమాదేవి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.శివకుమార్‌ను బాధ్యులుగా నియమించింది. వీరు మరో మూడు నెలలు బాధ్యతలు నిర్వహిస్తారు.

ఒక్కటే దిక్కు..!

పుట్టపర్తిలో ఒకే ఆధార్ కేంద్రం

పనిచేయని మిగతా మూడు సెంటర్లు

సేవలు పొందేందుకు జనం తిప్పలు

రోజుల తరబడి పడిగాపులు



ఆధార్ కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు



ఆధార్‌కార్డు కోసం పోస్టాఫీసులో గుమికూడిన ప్రజలు

పుట్టపర్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతి సేవకు ఆధార్ తప్పనిసరి. అందులో ఏ చిన్న పొరబాటు ఉన్నా.. సరిచేయించుకోవాల్సిందే. కొత్త ఆధార్ కార్డు పొందాలన్నా.. ఉన్న దాంట్లో తప్పొప్పులను సరిచేయించుకోవాలన్నా.. జిల్లాకేంద్రంలో ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. పుట్టపర్తిలో ఒకే ఒక ఆధార్ కేంద్రం పనిచేస్తోంది. అందులో సేవలు పొందాలంటే రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని జనం వాపోతున్నారు. జిల్లాకేంద్రంలో నాలుగు ఆధార్ కేంద్రాలను మంజూరు చేశారు. వీటిలో ఒకటి మాత్రమే పనిచేస్తోంది. తపాలా కార్యాలయంలో మాత్రమే ఆధార్ కేంద్రంలో సేవలు అందుతున్నాయి. రెండు బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సెంటర్లు పనిచేయట్లేదు. ఉన్న ఒక్క ఆధార్ కేంద్రంలో సేవలు పొందడం ప్రజలకు గగనంగా మారింది.

విద్యార్థుల నిరీక్షణ

ఆధార్ అప్‌డేట్ కోసం విద్యార్థులు నిరీక్షించాల్సి వస్తోంది. పాఠశాలకు గైర్హాజరై మరీ.. జిల్లా కేంద్రంలోని ఆధార్ సెంటర్‌కు విద్యార్థులు వస్తున్నారు. గంటలు, రోజులకొద్దీ వేచిచూడాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. సోమవారం మండలంలోని జగరాజుపల్లి, ఎనుములపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ కోసం జిల్లా కేంద్రంలోని పోస్టాఫీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌కు వచ్చారు. అక్కడ చాలామంది నిరీక్షిస్తుండడంతో వారికీ ఆ తిప్పలు తప్పలేదు. సాయంత్రమైనా పనికాలేదని విద్యార్థులు వాపోయారు. పదో తరగతి విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ కోసం పాఠశాలలో క్లాసులు వదిలి సెంటర్లో వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా అవుతోందనీ, తరగతులు కోల్పోవాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు. పాఠశాల పరిధిలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

మూడుసార్లు చేయించినా.. రిజెక్ట్ అయింది..



నా కుమారుడికి కొత్త ఆధార్ చేయించడానికి మూడుసార్లు పుట్టపర్తి పోస్టాఫీసుకు వచ్చా. ప్రతిసారీ రిజెక్ట్ అయిందంటూ సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం నాలుగోమారు వచ్చా. ఇక్కడ అధికమంది ఉండడంతో వేచిచూడాల్సి వస్తోంది. బుక్కపట్నంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో పుట్టపర్తికి రావాల్సి వస్తోంది. అధికారులు బుక్కప్నటంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- జ్యోతి, బుక్కపట్నం

పలుమార్లు చేయించినా..



నా కుమార్తె ఆధార్ కార్డులో పేరు తప్పుగా నమోదైంది. ఆధార్ అప్‌డేట్ చేయించమని పాఠశాల టీచర్లు చెబుతున్నారు. సరిచేసుకునేందుకు ఆధార్ కేంద్రానికి పలుమార్లు వచ్చా. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. వివరాలు సరిగా నమోదు చేసినా రిజెక్ట్ అవుతోంది. ఇంటిపేరు కూడా ఉండాలని టీచర్లు చెప్పారు. వీటిని సరిచేసుకోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది.

-లక్ష్మీనారాయణమ్మ, ఎనుములపల్లి



రక్తదానం చేస్తున్న పోలీసు సిబ్బంది

పోలీసుల రక్తదానం

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ, హిందూపురం బ్లడ్‌బ్యాంకు సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. పోలీసు సిబ్బందితోపాటు యువత, విద్యార్థులు, పోలీసులు పెద్దఎత్తున రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పెద్దఎత్తున యువత, విద్యార్థులు, రక్తదానం చేయడానికి ముందుకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు వలి, మహేశ్, రవికుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

వేవేల చరిత

- వెయ్యేళ్లకుపైగా విలసిల్లుతున్న చంద్రమౌళేశ్వరాలయం
- ఆలయం వద్ద లభించిన శాసనాలతో వెలుగులోకి ఘనత
- లేపాక్షి ఆలయం కంటే పురాతనమైనదిగా గుర్తింపు
- బ్రహ్మసూత్రం శివలింగం ఉండటం ఇక్కడి ప్రత్యేకత
- ఉపాధ్యాయుడు బుక్కపట్నం గోపి పరిశోధనతో వెలుగులోకి...

6



7

మొంథా మబ్బులు

(5వ పేజీ తరువాయి)

గొట్లూరు చెరువుకు చేరుతోంది.

భారీ వర్ష సూచన

ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి మంగళవారం తెలిపారు. అనంతపురం జిల్లాలో ఈ నెల 29న 2 సెం.మీ., 30న ఒక సెం.మీ., 31న 0.2 సెం.మీ. వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఈ నె 29న 2 సెం.మీ., 30న ఒక సెం.మీ., 31న 0.1 సెం.మీ., వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. రైతుల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పగటి ఉష్ణోగ్రతలు 27-33.3 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22.5-23.6 డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 10-18 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందని అన్నారు. గాలిలో తేమ ఉదయం పూట 81-88, మధ్యాహ్నం 58-80 శాతం నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

రైతులకు శాస్త్రవేత్తల సూచన

● ఆముదం పంటలో బూజు కనిపిస్తోంది. దీని నివారణకు కార్బండజిం ఒ గ్రాము, లదా థయోపెనేట్ మిథైల్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. కోత పనులు వాయిదా వేసుకోవాలి. అత్యవసర సమయంలో స్థానిక వాతావరణ పరిస్థితులు గమనించి, వ్యవసాయ పనులు చేసుకోవాలి.

●వరి పంటలో కంకి ప్రారంభం దశ నుంచి గింజ అభివృద్ధి దశలో ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో సుడిదోమ ఆశించింది. నివారణకు అసిఫేట్ 1.5 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. సుడిదోమ ఉధృతి ఎక్కువగా ఉంటే పైమెట్రోజన్ 0.6 గ్రాము లేదా డైనోటెఫ్యూరాన్ 0.4గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో బాక్టీరియా, ఆకు మచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు కాపర్ హైడ్రోక్సైడ్ 30 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ ఒక గ్రాము 10 లీటర్ల నీటిలో కలిపి పిచాకారి చేయాలి.

● పత్తి పంట పూత దశ నుండి కాయ అభివృద్ధి దశలో ఉంది. రసం పీల్చు పురుగులు ఉధృతి పెరిగే ప్రమాదం ఉంది. తెల్లదోమ ఉధృతిని గమనించడానికి పొలంలో పసుపు, నీలం రంగ అట్టలు ఎకరానికి 10 చొప్పున ఏర్పాటు చేయాలి. ఉధృతిని బట్టి ఇమిడాక్లోప్రైడ్ 0.4 మి.లీ. లేదా థయోమోథాక్సామ్ 25 డబ్ల్యూజీ 0.2 లేదా అసిటామప్రేడ్ 0.2 గ్రాము లీటర్ నీటికి, లేదా థయామెథాక్సామ్, ఫిప్రోనిల్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

● అరటిని సిగటోక తెగులు ఆశించే ప్రమాదం ఉంది. దీని నివారణకు టిల్ట్ 0.5 మి.లీ. లేదా కవచ్ 2 గ్రామ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. మిరప పంటలో అక్కడక్కడ శాఖీయ దశలో ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు సూది పురుగు ఆశించే ప్రమాదం ఉంది. నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచాకారీ చేయాలి.

● చీనీ పంటను పొలుసు పురుగు ఆశిస్తోంది. నివారణకు కాండాన్ని, కొమ్మలను గోనే పట్టాతో రుద్ది కెలియోల్ అయిల్ 5 మి.లీ. లేదా హార్టి మినరల్ ఆయిల్ 5 మి.లీ. డైమిథోయేట్ 2 మి.లీ. లేదా బప్రొఫెజిన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపే మొక్క బాగా తడిచే విధంగా పిచికారీ చేసుకోవాలి.

పెన్నా నదికి నీటి విడుదల

తాడిపత్రి: తుఫాన్ నేపథ్యంలో చాగల్లు రిజర్వాయర్‌కు వరద పెరుగోతంది. దీంతో ప్రాజెక్టు నుంచి నుంచి 600 క్యూసెక్కుల నీటి పెన్నా నదికి విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌కు పైనుంచి 700 క్యూసెక్కుల వరద వస్తోంది. నది పరివాహక ప్రాంతాల ఉన్న ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

పీఏబీఆర్ నుంచి..



జలవిద్యుత్ కేంద్రం వద్ద కరెంటు అధికారులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈ వెంకటరమణ

కూడేరు: తుఫాన్ నేపథ్యంలో పీఏబీఆర్ నుంచి జలవనరుల శాఖ అధికారులు దిగువకు భారీగా నీరు వదులుతున్నారు. హంద్రీనీవా, లింక్ ఛానల్ నుంచి డ్యాంలోకి 1000 క్యూసెక్కుల నీరు వస్తోంది. డ్యాం నుంచి రెండు గేట్ల ద్వారా 2,200 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. జలవిద్యుదుత్పత్తికి 985 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఇరిగేషన్ ఈఈ శశిరేఖ, డీఈ వెంకటరమణ విద్యుదుత్పత్తి గురించి మంగళవారం ఆ శాఖ అధికారులతో చర్చించారు. ప్రస్తుతం డ్యాం నీటి మట్టం 435.750 మీటర్లకు చేరుకుని, 5.357 టీఎంసీలు నిల్వ ఉంది.

నేడు గేట్లు ఎత్తే అవకాశం



సీబీఆర్‌లో నిల్వ ఉన్న నీరు

తాడిమర్రి: చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరుతోంది. ఇన్నాళ్లూ గండికోట నుంచి ఎత్తిపోతల పథకాల ద్వారా డ్యాంకు నీరు చేరుకోగా, ఇప్పుడు వర్షపు నీరు తోడైంది. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 9.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.3 టీఎంసీలకు చేరిందని ఏఈ అనీఫ్ తెలిపారు. ముదిగుబ్బ మండలంలోని యోగి వేమన ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ఆ నీరు కూడా చిత్రావతికి చేరుతుంది. మొత్తంగా 800 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరుతోంది. ఉన్నతాధికారుల అనుమతితో బుధవారం డ్యాం గేట్లు ఎత్తి దిగువకు నీరు వదిలే అవకాశం ఉందని ఏఈ తెలిపారు.

కూలిన ఇల్లు



హరేసముద్రంలో కూలిన ఇల్లు

బొమ్మనహాళ్: మండల పరిధిలోని హరేసముద్రంలో తుఫాను ప్రభావంతో ఓ ఇల్లు కూలిపోయింది. ప్రకాష్ అనే వ్యక్తి తన భార్య లక్ష్మి, పిల్లలు, తల్లి గౌరమ్మతో కలిసి ఇంట్లో నిద్రస్తుండగా సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటిపైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. వెంటనే వారు బయటకు వచ్చారు. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పిల్చుకున్నారు. తహసీల్దార్ మునివేలు బాధితులను పరామర్శించారు. నివేదిక ఇవ్వాలని వీఆర్వోకు సూచించారు. పలు గ్రామాలను సందర్శించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. తుఫాను ప్రభావం ఉన్నందున మొక్కజొన్న కోతలను విరమించుకోవాలని వ్యవసాయాధికారి సాయికుమార్ సూచించారు. బీటీపీ నుంచి వరద నీటిని హగరికి విడుదల చేశారు. దీంతో కల్లుదేవనహళ్లి, బందూరు రోడ్డులో వేదవతి హగరి వద్ద రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

బాధ్యతగా పనిచేయండి

● జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



నియామక పత్రాలు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్హతలను పరిగణనలోకి తీసుకకుని ఏఓలుగా ఉద్యోగోన్నతి కల్పించామని, ప్రజలకు బాధ్యతగా సేవలు అందించాలని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ సూచించారు. జడ్పీలో ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లకు ఏఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. సీఈఓ శివశంకర్ ఆధ్వర్యంలో తన చాంబర్‌లో చైర్‌పర్సన్ ఉద్యోగోన్నతి, కేటాయించిన స్థానాల ఉత్తర్వులను మంగళవారం అందజేశారు. పెద్ద వడుగూరు ఎంపీపీ కార్యాలయంలో పనిచేసే ఫణిశేఖర్ రెడ్డి, గార్లదిన్నె కార్యదర్శి ముత్యాలరెడ్డికి జడ్పీ కార్యాలయాన్ని కేటాయించారు. అనంతపురంలోని పీఆర్ క్యూసీలో పనిచేసే రవిని వజ్రకరూరు ఎంపీపీ కార్యాలయాన్ని కేటాయించారు. నల్లమాడ ఎంపీపీ కార్యాలయంలో పనిచేసే లోకమల్లికార్జున రెడ్డికి అమడగూరు ఎంపీపీ కార్యాలయాన్ని, బొమ్మనహాళ్ ఎంపీపీ కార్యాలయంలో పనిచేసే హనుమంతప్పను గుమ్మఘట్ట ఎంపీపీ కార్యాలయానికి, ఉరవకొండ ఎంపీపీ కార్యాలయంలో పనిచేసే క్రిష్ణనాయక్‌ను బెళుగుప్ప ఎంపీపీ కార్యాలయానికి, అనంతపురంలోని డ్వామా కార్యాలయంలో పనిచేసే మల్లికార్జునను బత్తలపల్లి ఎంపీపీ కార్యాలయానికి ఉద్యోగోన్నతిపై బదిలీ చేశారు.

సీఏఎస్ ఇంటర్వ్యూలు

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏల పరిపాలన విభాగంలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) కింద వివిధ విభాగాల ఆచార్యుల ఉద్యోగొన్నతికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య అధ్యక్షతన వివిధ బోర్డుల చైర్మన్లు, సభ్యులు, అనుభవజ్ఞులైన ఆచార్యులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఉద్యోగోన్నతుల ద్వారా మెకానికల్, ఈఈఈ, ఫిజిక్స్ విభాగంలో ఆచార్యులను భర్తీ చేస్తున్నారు. డీపీ ఆచార్య సత్యనారాయణ, ప్యానల్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తామని సీఈఓ శివశంకర్ మంగళవారం తెలిపారు. 1 నుంచి 7 వరకు అంశాలకు సంబంధించి అజెండా అంశాలను సిద్ధం చేశామని తెలిపారు. అజెండాకు అనుగుణంగా పలు అంశాలపై చర్చలు జరిపి, తీర్మానాలకు ఆమోదం తెలుపుతామని వెల్లడించారు. గౌరవ సభ్యులు జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఏఓ లకు, మరో ఏడుగురు డిప్యూటీ ఎంపీడీఓలకు ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పంచాయితీరాజ్ కమిషనర్ కృష్ణతేజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఓలలో శివశంకర్ శర్మ, వెంకటచలపతి, గంగాధర్, రత్నాబాయి, నాగేంద్రకుమార్, రామ్‌కుమార్, రామకృష్ణ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందారు. శివకుమార్ శర్మ ప్రస్తుతం విజిలెన్స్ విభాగంలో పని చేస్తున్నారు. అదే విభాగానికి ఎంపీడీఓగా నియమించారు. నాగేంద్ర కుమార్‌ను పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేశారు. అక్కడి అధికారులు మండలాన్ని కేటాయిస్తారు.మిగిలిన వారికి ఉమ్మడి జిల్లాలో జడ్పీ సీఈఓ శివశంకర్ స్థానాలను కేటాయిస్తారు. డిప్యూటీ ఎంపీడీఓలలో దామోదరమ్మ, రాధాకృష్ణ, దేవదాస్, హరికృష్ణ బాలాజీ, రఘురామ్, అశోక్‌కుమార్‌రెడ్డి, దివాకర్ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందారు. వీరికి జడ్పీ సీఈఓ మండలాలను కేటాయిస్తారు.

క్రీడాపోటీలు వాయిదా

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించాల్సిన ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలను వాయిదా వేస్తున్నామని డీఎస్‌డీఓ మంజుల తెలిపారు. తదుపరి క్రీడాపోటీల నిర్వహణ, ఇతర వివరాల కోసం 08554-315632 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గ్రంథాలయాల్లో విజిలెన్స్ వారోత్సవాలు

అనంతపురం విద్య, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్ర కార్యాలయంలో వారోత్సవాలు నిర్వహించారు. కార్యదర్శి మాట్లాడుతూ.. అవినీతిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిగ్రంథాలయంలో 2వతేదీ వరకు వేడుకలు కొనసాగుతాయన్నారు. అనంతరం ఆ శాఖ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శాప్ ఆధ్వర్యంలో అందజేసే నగదు ప్రోత్సాహక పథకానికి అర్హులైన క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీఓ మంజుల సూచించారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆధ్వర్యంలో ప్రకటించిన మార్గదర్శకాలకు అనుగుణంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను నగదు పురస్కారాలతో సత్కరిస్తామని తెలిపారు. అర్హులు నవంబరు 4వ తేదీలోపు SAAP kreeda app@https://sports.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08554-315632, 7989090758 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పాపాల్లో వైసీపీ పెద్దలు..?

కొలిక్కి వచ్చిన విజిలెన్స్ విచారణ

నగరపాలక సంస్థలో 'అనంత' అవినీతి

అక్రమార్కుల గుండెల్లో గుబులు

నేడు కౌన్సిల్ భేటీలో చర్చకు వచ్చేనా?



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో నగర పాలక సంస్థలో కోట్ల రూపాయల నిధుల దుర్వినియోగం వ్యవహారంలో పెద్దల పాత్ర ఉన్నట్లు జోరుగా చర్చ సాగుతోంది. ఈ అక్రమాలపై విజిలెన్స్ విచారణ కొలిక్కి వస్తున్న క్రమంలో అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి, మేయర్ పాత్రపై నిగ్గు తేలనుందా... అనే చర్చ సాగుతోంది. 2019-24 మధ్యకాలంలో అక్రమాలపై విజిలెన్స్ అధికారుల విచారణతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. ఆ అక్రమాలపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్.. కలెక్టర్, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు మూడు నెలలుగా విచారణ చేస్తున్నారు. కొలిక్కి వచ్చినట్లు సమాచారం. దీంతో అప్పట్లో పనిచేసిన అధికారులు, ఇంజనీర్లు, వైసీపీ ప్రజాప్రతినిధుల్లో ఆందోళన మొదలైంది. 2019-24 మధ్య వైసీపీ హయాంలో కొనుగోలు చేసిన పనిముట్లు, బ్లీచింగ్ పౌడర్, డంపింగ్ యార్డు, నగరంలో బ్యూటిఫికేషన్, ప్రభుత్వ భూముల కబ్జాలు, అక్రమ కట్టడాలు అంశాలపై విచారణ కొనసాగుతోంది. వైసీపీ హయాంలో అనుకూలంగా ఉండే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి రూ.లక్షల్లో కమీషన్లు దోచుకున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఈ తతంగం నడిచిందన్న వాదనలున్నాయి. బ్లీచింగ్ చల్లకనే చల్లినట్లు, పనిముట్లు కొనుగోలు చేయకనే రూ.లక్షలాది రూపాయల బిల్లులు చేసుకుని జేబులు నింపుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం నిర్వహించే నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో విజిలెన్స్ విచారణ ప్రధానంగా చర్చకు రానున్నట్లు తెలుస్తోంది.

రూ.కోట్లలో అవినీతిపై ఆరా

గత వైసీపీ ప్రభుత్వం 2019-24 మధ్య కాలంలో అనంత నగరపాలక సంస్థలో పనిముట్ల కొనుగోలుకు రూ.30లక్షలు, బ్లీచింగ్ పౌడర్‌కి రూ.67లక్షలు, బ్యూటిఫికేషన్ కోసం రూ.6 కోట్లు, డంపింగ్ యార్డుకు సంబంధించి రూ.23 కోట్లు మంజూరు చేయగా.. రూ.12కోట్లు అప్పట్లోనే చెల్లించారు. ఇలా ఐదేళ్లలో విచ్చలవిడిగా రూ.30కోట్ల వరకు నిధులు దుర్వినియోగమైనట్లు అభియోగాలు నమోదయ్యాయి. అప్పట్లో ఇంజనీరింగ్ విభాగంలో డీఈగా పనిచేసిన ఓ అధికారి తిరిగి ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో రూ.కోట్ల అవినీతిలో భాగమైన అధికారిని తిరిగి ఇక్కడికి ఎలా నియమిస్తారనే అంశంపై ఏఎంసీలో జోరుగా చర్చ సాగుతోంది. అప్పటి వైసీపీ నేతలతో ఆ అధికారి కుమ్మక్కై కోట్లాది రూపాయల ప్రజాసొమ్మును దుర్వినియోగం చేశాడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



డంపింగ్ యార్డు

పనులు చేయకనే రూ.23 కోట్లు స్వాహా

వైసీపీ హయాంలో డంపింగ్ యార్డు పేరుతో కోట్లాది రూపాయల నిధులు మింగేశారు. 2019 ఎన్నికలకు ముందు అప్పటి వైసీపీ అభ్యర్థులు డంపింగ్ యార్డు తరలిస్తామని ప్రగల్బాలు పలికినా ఒక్క అడుగు కూడా పడలేదు. చెత్తను తరలించే పేరుతో రూ.23కోట్ల వరకు బిల్లులు చేసి మెక్కేశారు. చెత్త, మట్టిని అక్రమంగా తరలించిన వైసీపీ ప్రజాప్రతినిధులు కోట్లాది రూపాయల సొమ్మును జేబుల్లోకి వేసుకున్నారు. అప్పట్లోనే ఒకే సమయంలో రూ.12కోట్లు బిల్లులు చెల్లించారు. ఇదే విషయాన్ని వైసీపీకి చెందిన కార్పోరేటర్లు బహిరంగంగానే పలు కౌన్సిల్ సమావేశాల్లో లేవనెత్తడం గమనార్హం.

వైసీపీ నిర్వాకంతో రూ.75కోట్ల పన్నులు పెండింగ్

గత వైసీపీ ప్రభుత్వంలో నగర పాలక సంస్థ ఓ న్యాయవాదిని నియమించుకుంది. దీంతో నగరపాలక సంస్థకు నీటి, ఆస్తి పన్ను వసూలు చేయకుండా ప్రజలకు నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేసినట్లు సమాచారం. దీంతో నగరపాలక సంస్థకు రావాల్సిన రూ.75కోట్ల ఆదాయంపై ప్రభావం పడింది. ఇందులో 400మందికి పైగా నోటీసులు ఇచ్చారు. నగర పాలక సంస్థకు న్యాయవాది అవసరమా అనే ప్రశ్న తలెత్తుతోంది.

విజిలెన్స్ అధికారులకు వివరాలు అందజేశాం

నగరపాలక సంస్థలో విజిలెన్స్ విచారణ జరుగుతున్న మాట వాస్తవమే. అధికారులు అడిగిన అన్ని వివరాలు అందజేశాం. విచారణకు సహకరించాం.

- బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్

అప్పటి ప్రజాప్రతినిధులదే బాధ్యత

గత వైసీపీ ప్రభుత్వంలో నగరపాలక సంస్థలో జరిగిన అక్రమాలకు అప్పటి ప్రజాప్రతినిధులే బాధ్యత వహించాలి. ప్రజాసొమ్మును దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. విజిలెన్స్ విచారణతో నిజాలు తేలుతాయి. అక్రమాల్లో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే, మేయర్ పాత్ర విజిలెన్స్ అధికారుల నివేదికలో తేలనుంది. ప్రజాధనం వడ్డీతో సహా కక్కిస్తాం. డంపింగ్ యార్డులో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి.

-దగ్గుపాటి ప్రసాద్, అనంత అర్బన్ ఎమ్మెల్యే

వేవేల చరిత



కుణుతూరులో వెలసిన పురాతన చంద్రమౌళీశ్వర ఆలయం



శాసనాలను చూపుతున్న ఉపాధ్యాయుడు బుక్కపట్నం గోపి

ధర్మవరం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమలోనే అత్యంత పురాతన దేవాలయాల్లో ఒకటిగా మండలంలోని కుణుతూరు గ్రామంలో ఉన్న చంద్రమౌళీశ్వర ఆలయం ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయాన్ని వెయ్యి సంవత్సరాల కిందటే నిర్మించినట్లు లభించిన ఆధారాలు చెబుతున్నాయి. ఇక్కడ లభించిన శిలా శాసనాలు చరిత్రను నేటి తరానికి పరిచయం చేస్తున్నాయి. ఊరికి ఉత్తరాన ఉన్న ఈ ఆలయానికి క్షేత్రపాలకుడు కాలభైరవుడు. ఈ ప్రాంతం ఎంతోమంది రాజుల ఏలుబడిలో విలసిల్లినట్లు లభించిన శాసనాల ద్వారా తెలుస్తోంది. పశ్చిమ చాళుక్యులు, హొయసాలలు, దేవగిరి యాదవులు, విజయనగర రాజ్యపాలకులు ఇలా వివిధ రాజవంశీయుల ఏలుబడిలో ఈ ఆలయం ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటి రాజులు చంద్రమౌళీశ్వరుడిని సందర్శించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. లేపాక్షి ఆలయం కంటే కూడా ఇది పురాతనమైనదిగా చరిత్రకారులు చెబుతున్నారు.

గోపి పరిశోధనతో వెలుగులోకి..

కొత్తచెరువు మండలం వంగంపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు బుక్కపట్నం గోపి జిల్లాలో పలు శాసనాలను గుర్తించి, వాటి చరిత్రపై పరిశోధన చేస్తున్నారు. మూడు నెలల కిందట ఈయన కుణుతూరులోని చంద్రమౌళీశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఆలయం ఎదుట ఉన్న శిలాశాసనాన్ని గమనించారు. రాతిస్తంభం మీద చెక్కిన ప్రాచీన శాసనాన్ని గుర్తించారు. కన్నడ భాషలో ఉన్న ఆ శాసనాన్ని కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని భారతపురావస్తుశాఖ కార్యాలయం డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపారు. ఆయన దాన్ని పరిశోధించి, అందులో ఉన్న సమాచారాన్ని ఉపాధ్యాయుడు గోపికి పంపారు. దాని ప్రకారం ఆ శాసనాన్ని క్రీ.శ 1218వ సంవత్సరం అక్టోబరు 22న దేవగిరి యాదవరాజు రెండో సింహనుడు (సింగనుడు)వేయించారు. ఈ శాసనం ప్రకారం చంద్రమౌళీశ్వరాలయానికి కొన్ని భూములను మాన్యంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. రెండో సింహనుడి తరఫున మహామండలేశ్వర అభ్యారసదేవ చోళమహారాయ భూమిని కానుకగా సమర్పించినట్లు శాసనంలో రాశారని గుర్తించారు. గ్రామంలో రెండో సింహనుడి శాసనంతో పాటు మరో రెండు ప్రాచీన శాసనాలు కూడా ఉన్నట్లు భారత పురావస్తు శాఖ డైరెక్టర్ తెలిపినట్లు పరిశోధకుడు గోపి ద్వారా తెలిసింది.

పదో శతాబ్దంలో ఆలయ నిర్మాణం

చంద్రమౌళీశ్వర ఆలయాన్ని, అక్కడే ఉన్న వినాయకుడి ఉపాలయాన్ని పశ్చిమ చాళుక్యులు క్రీ.శ 10వ శతాబ్దంలో నిర్మించినట్లు రెండు శాసనాల ద్వారా తెలుస్తోంది. కొల్లాపురమ్మ ఆలయాన్ని కూడా అప్పట్లోనే నిర్మించినట్లు తెలుస్తోంది. ఊరికి ఉత్తరాన ఉన్న ఆలయం పక్కనే శ్మశాన వాటిక ఉంది. అప్పట్లో ఆలయ సమీపంలో స్నానమాచరించేందుకు పెద్దవంకను ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆలయంలో ఉన్నది అరుదైన బ్రహ్మసూత్రం కలిగిన శివలింగంగా పరిశోధనలో చరిత్రకారులు గుర్తించారు.



క్రీస్తుశకం 1218లో ఆలయం ఎదుట చెక్కించిన శిలశాసనాలు

ఆలయానికి 16 ఎకరాల మాన్యం

ఆలయానికి గ్రామంలో 16 ఎకరాల మాన్యం ఉంది. ఈ భూమిని ఆలయ అర్చకుడి ద్వారా రైతులకు కౌలుకు ఇచ్చి వచ్చిన ఆదాయాన్ని స్వామివారి పూజలు, ధూప దీప నైవేద్యాలకు ఉపయోగిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

జైనులు నిర్మించిన జయనేశ్వర ఆలయం

గ్రామంలో పురాతన చంద్రమౌళీశ్వర ఆలయం పక్కనే జయనేశ్వరాలయం ఉంది. ఈ ఆలయాన్ని జైన మతస్థులు నిర్మించినట్లు , ఆలయంలో శివలింగాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామ పూర్వీకుల ద్వారా తెలుస్తోంది. జయనేశ్వరాలయానికి గతంలో 18ఎకరాల మాన్యం కూడా ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఆ భూమి అన్యాక్రాంతం అయినట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆ ఆలయాన్ని జయమ్మ ఆలయంగా గ్రామస్థులు పిలుస్తున్నారు. దేవాలయ గొప్పతనాన్ని, వైభవాన్ని ప్రజలందరికీ తెలిసేలా దేవదాయశాఖ తగు చర్యలు తీసుకోవాలని పరిశోధకులు, చరిత్రకారులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ఆలయానికి వస్తే మనశ్శాంతి



మా గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి చంద్రమౌళేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయానికి చాలా మంది వస్తుంటారు. కోరిన కొర్కెలు తీర్చేదేవుడిగా ఇక్కడి స్వామి ప్రసిద్ధికెక్కారు. ఈ దేవాలయానికి వస్తే మనశ్శాంతిగా ఉంటుంది.

- పాగాల లక్ష్మీదేవి, కుణుతూరు, ధర్మవరం మండలం

చిన్నప్పటి నుంచి వెళ్తున్నా




మా ఊర్లోని చంద్రమౌళేశ్వర ఆలయానికి నేను చిన్నప్పటి నుంచి వెళుతున్నా. ఎక్కడాలేని విధంగా బ్రహ్మసూత్రం కలిగిన శివలింగం ఉండటం అదృష్టంగా భావిస్తున్నాం. ఇక్కడ స్వామివారిని ఏమి కోరినా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కాలభైరవుడు, గణపతి స్వామివార్లు ఆలయంలో ఒకేచోట ఉండటంతో అందరిని దర్శించుకుంటాం. ప్రతి ఏటా కార్తీకమాసం, మాఘమాసంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయి. దేవదాయశాఖ అధికారులు ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

-సదాశివగౌడ్, కుణుతూరు, ధర్మవరం మండలం

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్



విష్ణు విశాల్ కథా నాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవి తేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవ నుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ట మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.



శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబానో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి



దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకొని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్ర పోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగినప్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు.. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి

ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని



అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

వైసీపీకి షాక్..!

- తిరగబడ్డ ఎంపీటీసీలు... బెళుగుప్ప ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం వద్దంటూ ఆర్డీఓకి వినతి



ఆర్డీఓకి వినతిపత్రం ఇస్తున్న వైసీపీ ఎంపీటీసీలు

బెళుగుప్ప, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి ఆ పార్టీ ఎంపీటీసీలు షాకిచ్చారు. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం విషయంలో ఎదురు తిరిగారు. ఎంపీపీ పెద్దన్నను అవిశ్వాసం పెట్టి ఒక్కరోజైనా పదవి నుంచి దించాలన్న వైసీపీ నాయకుల అంచనాలను తారుమారు చేశారు. అవిశ్వాస తీర్మానం వద్దు అంటూ ఆ పార్టీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు మంగళవారం ఆర్డీఓ వసంతబాబుకు వినతిపత్రం ఇచ్చారు. అప్పట్లో వైసీపీ నాయకులు మభ్యపెట్టి అవిశ్వాస తీర్మానంపై తమతో సంతకాలు చేయించారనీ, ఆ నిర్ణయాన్ని వెనక్కుతీసుకుంటున్నామని వారు తెలిపారు. బెళుగుప్ప, శీర్పి, తగ్గుపర్తి, బెళుగుప్ప తండా, కాలువపల్లి నుంచి టీడీపీలోకి చేరిన వారు.. ఎంపీపీ పెద్దన్నకు మద్దతు పలికారు. అనంతపురంలో జడ్పీ సీఈఓకు కూడా వినతిపత్రం ఇచ్చారు. ఎంపీపీగా పెద్దన్నను కొనసాగించాలని ఆర్డీఓను కోరారు. మరికొందరు వైసీపీ ఎంపీటీసీలు మద్దతు తెలిపే అవకాశాలున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. అప్పట్లో టీడీపీ పోటీ నుంచి తప్పుకోవడంతో అందరూ వైసీపీ సభ్యులే ఏ కగ్రీవమయ్యారు. ఎంపీపీగా పెద్దన్నను ఎన్నుకున్నారు. ఆయన సార్వత్రిక ఎన్నికల అనంతరం టీడీపీలో చేరారు. అయనను ఎంపీపీ పీఠం నుంచి దించాలని వైసీపీ నాయకులు భావించారు. తమకే సంపూర్ణ బలం ఉందనీ, అవిశ్వాసం నెగ్గుతామని ధీమాగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పది మంది ఎంపీటీసీలు.. అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని ఆర్డీఓకి వినతిపత్రం ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో ఎంపీపీ పెద్దన్నతోపాటు ఐదుగురు సభ్యులు అవిశ్వాసం వద్దు అంటూ ఆర్డీఓ, జడ్పీ సీఈఓకి వినతిపత్రాలు ఇవ్వడం గమనార్హం. మరికొందరు ఎంపీటీసీలు.. టీడీపీలోకి చేరుతారన్న ప్రచారం నేపథ్యంలో అవిశ్వాస తీర్మనంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

బైక్‌లు ఢీకొని యువకుడి దుర్మరణం

సోమందేపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ్రాయనపల్లి వద్ద జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాలు ఢఢీకొన్న ప్రమాదంలో బెంగళూరుకు చెందిన గణేష్(23) దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గణేష్ సోమందేపల్లిలోని నక్కలగుట్ట కాలనీలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. మంగళవారం తిరుగు ప్రయాణమయ్యాడు. నాగినాయనిచెరువు తండాకు చెందిన గోపాల్‌నాయక్ సోమందేపల్లిలో చదువుతున్న మనవరాలిని పిలుచుకుని స్వగ్రామానికి వెళ్తూ రోడ్డు దాటుతుండగా గణేష్ ఢీకొట్టాడు. ప్రమాదంలో గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. గోపాల్‌నాయక్, అతడి మనవరాలు గాయపడ్డారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు. గణేష్ మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు.

టమోటా కిలో రూ.24

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.24తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 1650 టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. టమోటా కిలో కనిష్ఠ ధర రూ.12, సరాసరి ధర రూ.17తో విక్రయాలు జరిగాయని పేర్కొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి కృషి

(5వ పేజీ తరువాయి)

కమిటీ సభ్యుడు విజయ్‌కుమార్ ప్రశ్నించారు. 40 కేసులు ఉన్నాయని, కులాలవారిగా వేరు చేయలేదని సమాధానమిచ్చారు. అట్రాసిటీ కేసులను సీరియస్‌గా తీసుకోవాలని కమిటీ అధ్యక్షుడు కుమార్ రాజా వర్ల సూచించారు.

అధికారుల తడబాటు

సాంఘిక సంక్షేమ శాఖ పథకాల గురించి సోషల్ వెల్ఫేర్ డీడీ ఖుష్మా కొఠారి వివరిస్తుండగా ఎమ్మెల్యే రాజు కల్పించుకున్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు ఎంత..? వేటి కోసం ఖర్చు చేశారో వివరంగా చెప్పాలన్నారు. నోట్‌లో క్లియర్‌గా ఉందని ఆమె సమాధానం ఇచ్చారు. 'అందులో ఉన్నవి సరే..! మీరు చెప్పండి' అని ఎమ్మెల్యే అడగడంతో ఆమె తడబడ్డారు. క్షేత్రస్థాయిలో రిపోర్ట్ లేదని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. 2019-24లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం అయ్యాయని అన్నారు. నూతనంగా ఎస్సీ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని కమిటీ అధ్యక్షుడు తెలిపారు. ఎస్సీ కమ్యూనిటీకి, శ్మశాన వాటికలకు స్థలం, రహదారి, ప్రహరీ ఏర్పాటుకు ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఎస్సీలకు పీఎం అజయ్ తదితర పథకాల కింద లబ్ధి చేకూర్చాలని కమిటీ సభ్యుడు విజయ్‌కుమార్ సూచించారు. స్పెషల్ డ్రైవ్ కింద శ్మశానవాటికల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే రాజు సూచించారు. శ్మశాన వాటికల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. డ్రగ్స్ గంజాయి ఉపయోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు కావలి గ్రీష్మ ఎస్పీని కోరారు. ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేశామని, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ సమాధానమిచ్చారు.

రిజర్వ్‌డు ఎమ్మెల్యేలంటే అంత ఇదా?

ఎస్సీలకు ఇళ్ల మంజూరు విషయంపై కమిటీ సభ్యులు మాట్లాడుతూ పొజిషన్ సర్టిఫికెట్ జారీ ఉన్న ఇబ్బందులు పరిష్కరించాలన్నారు. హౌసింగ్ పీడీ శైలజ పరిస్థితి వివరించారు. ఇదే సందర్భంలో మీరు వాట్సాప్ స్టేటస్ ఏం పెట్టారమ్మా అంటూ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రశ్నించారు. మీకు రిజర్వుడు ఎమ్మెల్యేలు అంటే అంత ఇదా అన్నారు. బై మిస్టేక్ అయింది సర్ అంటూ ఆమె చెప్పే ప్రయత్నం చేశారు. ఎలా మిస్ అవుతుందమ్మా...మీ మీద నాకేమైనా కక్షా...మీ పేరు కూడా తెలియదు నాకు, పొలిటికల్ లీడరా మీరు? రిజర్వుడు ఎమ్మెల్యేలను మీరు చూసే కోణం వేరు అంటూ మండిపడ్డారు. అనంతరం శాసనసభ కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిధులను పారదర్శకంగా వాడాలి..

పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు కుమార్‌రాజా వర్ల మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధికి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను పారదర్శకంగా వినియోగించాలని సూచించారు. అట్రాసిటీ కేసులను సత్వరం పరిష్కరించాలని, బాధితులకు పునరావాసం కల్పించాలని, ఆర్థిక సాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ కాలనీల్లో శ్మశాన వాటికలు, ప్రహరీలు, నీటి సదుపాయాన్ని కల్పించేందుకు ఉపాధి పథకం నిధులను ఉపయోగించుకోవాలని సూచించారు. పరిశ్రమలశాఖ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా చిన్నచిన్న యూనిట్ల స్థాపనకు రూ.1500 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, అందులో రూ.184 కోట్లు శ్రీసత్యసాయి జిల్లాకు కేటాయించిందని తెలిపారు. ఎస్సీ కాలనీల్లో శ్మశాన వాటికల ఏర్పాటు ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. తమ నియోజకవర్గంలో వచ్చే నెలలో వంద శ్మశానవాటికలను ఒకేసారి ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. అట్రాసిటీ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కమిటీ సభ్యులు కావలి గ్రీష్మ, విజయ్‌చంద్ర సూచించారు. ప్రజలు ఇచ్చే ఆర్జీలను పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయిని కట్టడి చేయాలని సూచించారు. కమిటీ సూచనల మేరకు ఎస్సీ సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేస్తామని కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. అట్రాసిటీ కేసుల పరిష్కారంపై పోలీసు విభాగం ప్రత్యేక దృష్టి సారించిందని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. డ్రగ్స్ అరికట్టడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిటీ అధ్యక్షుడు, సభ్యులను కలెక్టర్, ఎస్పీ, సోషల్ వెల్ఫేర్ జేడీ రెడ్డి బాలాజీ సత్కరించారు. ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంపత్ కుమార్, డీఎఫ్‌ఓ చక్రపాణి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎస్పీలు విజయ్‌కుమార్, నరసింగప్ప, శివన్నారాయణస్వామి, మహేష్, హేమంత్‌కుమార్, డీసీఓ కృష్ణానాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో వీఎన్ రెడ్డి అంత్యక్రియలు



అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న కలెక్టర్, అధికారులు

పావగడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, కల్లూరు సుబ్బరావు సమకాలికుడు వెంకటాపురం నరసింహారెడ్డి (వీఎన్ రెడ్డి) అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో మంగళవారం ఆయన స్వగ్రామమైన వెంకటాపురంలో నిర్వహించారు. కలెక్టర్ శుభకల్యాణి, డీఎస్పీ మంజునాథ్, తహసీల్దార్ రవి, మాజీ మంత్రి వెంకటరమణప్ప తదితరులు.. వీఎన్‌రెడ్డి భౌతికకాయాన్ని దర్శించి, పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయనతోటలోనే అంతిమ సంస్కారాలు ప్రభుత్వ లాంఛనాలతో జరిపించారు. తుది దర్శనం కోసం వేలాదిమంది ఆయన అభిమానులు, నాయకులు తరలివచ్చారు. అంత్యక్రియలకు ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.



నివాళి అర్పిస్తున్న డీఎస్పీ మంజునాథ్

చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి ధర రూ.15 వేలు పలికాయని వివరించారు.

న్యూస్ బాక్స్

పెద్దమ్మ దేవతకు ప్రత్యేక పూజలు



ధర్మవరం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని చిగిచెర్ల గ్రామంలో వెలసిన పెద్దమ్మదేవతకు మంగళవారం కార్తీకమాస ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి అమ్మవారికి ఆకుపూజ, నైవేద్యం తదితర పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద దీపాలు వెలిగించారు. భక్తులకు పూజారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సిస్టర్ నివేదిత జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ధర్మవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సిస్టర్ నివేదిత 158వ జయంతి వేడుకలను ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళ వారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో కేక్‌కట్ చేసి ఆమెకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వనితావాణి మాట్లాడుతూ... స్వామి వివేకానంద శిష్యురాలైన సిస్టర్ నివేదిత 17 ఏళ్ల వయస్సులో ఉపాధ్యాయ వృత్తి చేపట్టి, బాలికల విద్యకోసం తనవంతుగా ప్రోత్సాహం అందించిందన్నారు. ఆమె మన దేశానికి చేసిన సేవలను గుర్తుకు చేసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఐక్యతా యాత్రను విజయవంతం చేయండి'

ధర్మవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉక్కుమనిషి, జాతీయ ఐక్యత కు ప్రతీక అయిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించే ఐక్యతా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వి ద్యాసంస్థల యాజమాన్యాలతో మంగళవారం రాత్రి ఆయన సమావేశ మయ్యారు. పట్టణంలో నిర్వహించే ఐక్యతా యాత్రలో విద్యార్థులు, ఉపా ధ్యాయులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, సామాజిక సంస్థలు పాల్గొని దేశభక్తి భావనను ప్రదర్శించాలన్నారు. యువతలో దేశభక్తిని, ఐక్యతా స్ఫూర్తిని పెంపొందించేలా చేయాలని సూచించారు.

150 వసంతాల వందేమాతరం



విద్యార్థులతో వందేమాతరం పలికిస్తున్న ఉపాధ్యాయుడు

అమడగూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లోకుజుపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శివ శంకర్ మంగళవారం విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతం 150 వసంతాల వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వాతంత్రం సమయంలో భారతీయులలో దేశభక్తి జ్యోతి రగిలించిన ఈ గీతం అన్నారు. విద్యార్థులతో కలిసి ఆలపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు దొంగల భయం

గాండ్లపెంట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో వ్యవసాయ బోర్ల వద్ద చోరీలు జరుగుతుండటంతో దొంగల భయం అధికం అవుతోందని మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు వ్యవసాయ బోర్లకు అమర్చిన కేబుల్, సర్వీస్ వైర్లు, స్టార్టర్లు, వ్యవసాయ పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు రాత్రిళ్లు ఎత్తుకెళ్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సాగుచేసిన పంటలకు నీరందించేందుకు అంతరాయం కలుగుతుండడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. మండలంలో ఇలాంటి చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను రైతులు కోరుతున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు గుర్తింపుకార్డుల పంపిణీ



గుర్తింపుకార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

ధర్మవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక విజన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఏర్పడిన సందర్భంగా పరిసరాల మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లకు గుర్తింపు కార్డులు పంపిణీచేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎన్జీఓహోంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి వందమందికి కార్డులను పంపిణీచేశారు. జిల్లాలో ఉన్న ప్రతి ల్యాబ్ టెక్నీషియన్ సమస్యలు పరిష్కరించి, హెల్త్ ఇన్సూరెన్స్ కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ధర్మవరం డివిజన్ అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సయ్యద్, అశోక్‌నాయక్, జనరల్ సెక్రటరీ మనోహర్, సెక్రటరీ రాజేశ్, కోశాధికారి చరణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సమావేశం కరపత్రాల విడుదల



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బలిజ సంఘం నాయకులు

కదిరి అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో నవంబరు 2న జరిగే బలిజ కాపునాడు సంఘాల స్వర్ణోత్సవ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో మంగళవారం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాపు, తెలగ, బలిజ, ఒంటరి తదితర ఉపకులాలను ఒకే తాటిపైకి తెచ్చి, వారి సమస్యల పరిష్కారానికి స్థాపించిన కాపునాడు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతపురంలోని గుత్తి రోడ్డు వద్ద చలమారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించే సమావేశానికి బలిజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సంఘం నాయకులు నాగభూషణ, మధు, రంగనాయకులు, పరంధామ, అశోక్, యర్రంశెట్టి రమేష్, గరడాల రమణ తదితరులు పాల్గొన్నారు.

దారంతా గుంతలే..!

● రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు



అధ్వానంగా పుట్టపర్తి రోడ్డు



ముదిగుబ్బ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లు గుంతల మయంగా మారాయి. వర్షాకాలం కావడంతో ఎటుచూసినా గుంతల్లో నీరు నిలబడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రాళ్లఅనంతపురం క్రాస్ నుంచి హుస్సేన్‌పురం, కొడవం డ్లపల్లి వరకు రోడ్డు అధ్వానంగా మారింది. ఈ మార్గంలో అధికంగా ఇసుక టిప్పర్లు వెళ్లడంతో తారురోడ్డు ధ్వసమైంది. గతంలో రోడ్డుకు అక్కడక్కడ మరమ్మతులు చేపట్టినా మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. బ్రహ్మదేవరమర్రి, గంగిరెడ్డిపల్లి మధ్య ఈ రోడ్డు పూర్తిగా స్వరూపం కోల్పోయింది. కొండవండ్ల పల్లె నుంచి చిన్నకోట్ల, యర్రగుంట పల్లి, రాఘవపల్లి వరకు ఉన్న తారు రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఆయా రోడ్లలో ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించాలంటే ప్రజలు నిత్యం అవస్థలు పడుతు న్నారు. రాత్రి వేళల్లో మలుపుల్లో వేగాన్ని అదుపు చేయలేక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

గ్రామీణ రోడ్ల పరిస్థితి ఇలా...

● మలకవేముల క్రాస్ నుంచి సానేవారిపల్లి మీదుగా పి.కొట్టాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ప్రధానంగా ఒడ్డుకింద తండా నుంచి కోటిరెడ్డిపల్లి, పాముదుర్తి కొట్టాల వరకు తారు కొట్టుకుపోయి రోడ్డు ఛిద్రమైంది. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి.

● రాచువారిపల్లి తండా-దొరిగల్లు ఘాట్ రోడ్డు నుంచి ఒడ్డుకింద తండాకు వెళ్లే అప్రోచ్ రోడ్డు దారుణంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో సగం దారి కంకర పరిచి వదిలేయగా మిగతా మట్టిరోడ్డు అలాగే ఉంది.

● ముదిగుబ్బ మేజర్ పంచాయతీలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి అడుగడుగునా గుంతలమయంగా మారింది. బస్టాండ్ కూడలి నుంచి బైపాస్ బ్రిడ్జి వరకు ఎటు చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి.

● పుట్టపర్తి-ముదిగుబ్బ వెళ్లే రోడ్డులో పాతూరు వద్ద రోడ్డు గుంతల మయమై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



ఒడ్డుకింద తండా నుంచి కోటిరెడ్డిపల్లి, పాముదుర్తి కొట్టాల దగ్గర తారు కొట్టుకుపోయి రోడ్డు అధ్వానంగా మారింది. రాత్రిళ్లు, అత్యవసర సమయాల్లో ఎక్కడికన్నా వెళ్లాలంటే ప్రయాణం ఇబ్బందికరంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

-క్రిష్ణ, పాముదుర్తి కొట్టాల, ముదిగుబ్బ మండలం

ఇబ్బందులు పడుతున్నాం



మలకవేముల క్రాస్ నుంచి సానేవారిపల్లి మీదుగా పి.కొట్టాలకు వెళ్లే దారి కంకర తేలి గుంతలమయంగా మారింది. ఆ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. రోడ్డు మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలి.

-శివయ్య, సానేవారిపల్లి, ముదిగుబ్బ మండలం

ప్రతిపాదనలు పంపాం

ముదిగుబ్బ నుంచి దొరిగల్లు రోడ్డుకు 40లక్షలు, రాళ్ల అనంతపురం క్రాస్ నుంచి చిన్నకోట్లకు రూ.3కోట్లతో ప్రతిపాదనలు పై అధికారులకు పంపాము, నిధులు మంజూరు అయిన వెంటనే పనులు చేపడతాం.

- కంబగిరి, ఆర్‌అండ్‌బీ డీఈ, కదిరి

నివాసయోగ్యమైన స్థలాలను గుర్తించండి

● రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే సింధూరరెడ్డి సూచన



విగ్రహ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని నిరుపేదల కోసం ఉపయోగకరమైన నివాస స్థలాలను వెంటనే గుర్తించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని మామిళ్లకుంట్ల పల్లి పంచాయతీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములతో పాటు గతంలో ప్రభు త్వం పేదలకు కేటాయించిన ఎన్టీఆర్‌కాలనీ ప్రాంతాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పరిశీలించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులతో పాల్గొన్నారు. ముందుగా వడ్డెర కమ్యూనిటీ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, నిర్మాణ పనులకు ఎదురవుతున్న అడ్డంకులపై రెవెన్యూ అధికారులతో ఆరాతీశారు. రెవెన్యూ అధికారులు సోషల్ వెల్ఫేర్ అధికారులు సమన్వయంతో పనిచేసి పనులు వేగవంతం చేయాలని సూచించారు. మహమ్మదాబాద్ క్రాసింగ్, వేమారెడ్డిపల్లి, కొండకమర్ల జంక్షన్, ఎం.కొత్త పల్లి రెవెన్యూ పొలం, ఇనుగలూరు పొలంలోని ప్రభుత్వ భూములను వారు పరిశీలించారు. ఎన్టీఆర్, వడ్డె ఓబన్న, శ్రీకృష్ణదేవరాయులు, యోగివేమన తదితర విగ్రహాల ఏ ర్పాటు కోసం వారు స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి మా ట్లాడుతూ ప్రజా అవసరాల కోసం ప్రభుత్వ భూములను గుర్తించి, వాటిని సంరక్షించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కంచె ఏర్పాటు చేయాలన్నారు. త్వరలో ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు, నూతనంగా ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబుల్ ఎడ్డి, టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, నాయకులు తుమ్మల మహబూబ్‌బాషా, నిజాం, కంచి సురేష్, మస్తానమ్మ, బుద్దల ప్రవీణ గోపినాథ్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఇడగట్టు వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

ధర్మవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ ముఖ్య కార్యదర్శి రమ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ పన్ను బకాయిలు గురించి అడిగితెలుసుకున్నారు. పాఠకులు సభ్యత్వాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది రాము, రికార్డు అసిస్టెంట్ గంగాధర్, ముకుంద, పాఠకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చేనేత కార్మికుడికి గాయాలు

ధర్మవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో మంగళవారం రాత్రి లారీ కింద పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని సాయినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు నాగముని శివానగర్‌కు ద్విచక్రవాహనంలో వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఎన్టీఆర్ సర్కిల్‌లో బత్తలపల్లి వైపు నుంచి ధర్మవరం వెళ్తున్న లారీ ఢీకొట్టింది. నాగముని కిందకు పడగానే లారీ ముందు చక్రం అతడి కాలిపై వెళ్లడంతో నుజ్జునుజ్జైంది. లారీ డ్రైవర్ లారీని నిలబెట్టకుండా వెళ్లిపోయినట్టు స్థానికులు తెలిపారు. అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

శాసనసభ కమిటీ సభ్యులకు సన్మానం



కమిటీ చైర్మన్ కుమార్‌రాజాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా పుట్టపర్తికి వచ్చిన రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాసనసభ కమిటీ చైర్మన్, సభ్యులను ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఘనంగా సన్మానించారు. మంగళవారం జిల్లాకు వచ్చిన శాసనసభ కమిటీ చైర్మన్ వర్ల కుమార్‌రాజా, సభ్యులు ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, ఎమ్మెల్యేలు రోషన్‌కుమార్, విజయానంద్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, పట్టుశాలువాలతో ఘనంగా సన్మానించారు.

రోడ్ల పునరుద్ధరణపై నిర్లక్ష్యం

● తాగునీటి పైపులు పూడ్చి వదిలేసిన వైనం

● కొన్నేళ్లుగా గుంతల రోడ్లతో ప్రజల ఇబ్బందులు



మగ్గాల వీధిలో పైపులు పూడ్చి వదిలేసిన రోడ్డు

పుట్టపర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి లో... చాలా ప్రాంతాల్లో ఎటు చూసినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. తరచూ రోడ్లను తవ్వడం.. పూ డ్చడం చేస్తుండడంతో సిమెంట్ రోడ్లు కాస్త మట్టి రోడ్లుగా, గుంతల రోడ్లుగా మారాయి. రక్షిత మంచి నీటి సరఫరా ఏర్పాట్ల పేరుతో ఉన్న సీసీ రోడ్లను తొలగించి పైప్‌లైన్లను వేశారు. పైపు లైన్లను పూడ్చి రెండేళ్లు పూర్తయినా ఇంతవరకు రోడ్లను బాగు చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఎనుములపల్లి గణేష్ సర్కిల్ ప్రాంతంలో పలు వీధులతో పాటు బీసీ, ఎస్సీ కాలనీలు ఎనుములపల్లి పాతూరులోని పలు వీధులలో పైప్‌లైన్లు వేశారు. వీటి కోసం సీసీరోడ్లను తొలగించి పైపులైను పూడ్చారు. పైపులు పూడ్చిన ప్రాంతంలో తిరిగి సీసీరోడ్లు వేయకపోవడంతో అవి కాస్త గుంతలమయంగా మారి ప్రయాణికులకు, పాదాచారులకు ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా వీధుల్లో వర్షపునీరు నిలిచి బురద గుంతలు ఏర్పడ్డాయి. పైప్‌లైన్ వేసిన కాంట్రాక్టర్ మాత్రం తిరిగి సిమెంటు రోడ్డు వేయడాన్ని మరచిపోయినట్లు తెలుస్తోంది. మా రోడ్లు బాగుచేయండంటూ స్థానికులు అధికారులను కోరుకుంటున్నారు. ప్రధాన రోడ్డు మాత్రం బాగుంటే సరిపోతుందా... మా రోడ్లను బాగుచెయ్యలేరా అని ఆయా ప్రాంతాల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి కాలనీల్లో ఉన్న రోడ్లను సైతం బాగుచేయాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. సత్యసాయి శతజయంతి వేడుకలకైనా తమ ప్రాంతాల్లోని రోడ్లు బాగుపడతాయనే ఆశతో స్థానికులు ఎదురుచూస్తున్నారు.



బీసీ కాలనీలో రోడ్డు దుస్థితి

మూడేళ్లుగా రోడ్డు వేయలేదు



నీటిపైపులు పూడ్చారు సిమెంటు రోడ్డు వేయడం మరచిపోయారు. మూడేళ్ల నుంచి రోడ్డు వేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా ప ట్టించుకోలేదు. ఇప్పటికైనా రోడ్డు వేస్తే బాగుంటుంది. రోడ్డు లేక చీకట్లో జారిపడుతున్నాం.

-సుధాకర్, బీసీ కాలనీ

ఇప్పుడైనా రోడ్డు వేస్తారని ఆశ



గత వైసీపీ ప్రభుత్వంలో తాగునీటి పైప్‌లైన్ వేసేందుకు సిమెంటు రోడ్లు తవ్వారు. పైపులు పూడ్చి అలాగే వదిలేశారు. ఆ రోడ్డు కాస్తా గుంతల మయంగా మారాయి. గుంతలను పూడ్చి సిమెంటు రోడ్డు వేయాలని అప్పట్లో కోరినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో రోడ్డు మధ్యలో కాలువలా ఏర్పడి వర్షపునీరు నిలిచి బురదగుంటలామారింది. పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కూటమి ప్రభుత్వంలోనైనా ఆ గుంతను పూడ్చి సిమెంటురోడ్డును పునరుద్దరిస్తారని ఆశిస్తున్నాం.

- వెంకటరాముడు, ఎనుములపల్లి

స్వదేశీ వస్తువులనే వాడుదాం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్



స్వదేశీ వస్తువులు వాడాలంటూ అవగాహన కల్పిస్తున్న జీఎం శేఖర్

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ, ప్రతిఇంటా స్వదేశీ వస్తువులనే వాడుదాం అంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వార్డుల్లో, సూపర్‌మార్కెట్లలో స్వదేశీ వస్తువుల వాడకంపై ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. మేక్‌ఇన్ ఇండియా ఉత్పత్తులనే వాడుదాం, దేశ ఆర్థికవ్యవస్థను బలపరుద్దామంటూ ఆయన పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గడంతో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గి సామాన్యులకు మేలు జరిగిందన్నారు. అధిక ధరలు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, అధికార ప్రతినిధి జ్యోతి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్, నాయకులు సురేంద్ర బాబు, రామాంజినేయులు, నారాయణ, బాలగంగాధర్, మేదర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జయంతి వేడుకలకు నిధుల మంజూరుపై హర్షం

కొత్తచెరువు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి వేడుకలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.30కోట్లు మంజూరుచేయడంపై పుట్టపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ పూలశివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. శత జయంతి వేడుకలకు ప్రపంచ దేశాల నుంచి వచ్చే భక్తులకు, ప్రజలకు ఎలాంటి సౌకర్యం కల్గకుండా వినియోగించుకునేవిధంగా ఈ నిధులను విడుదల చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో ఈ నిధులను విడుదల చేయడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ నిధులను సక్రమంగా వినియోగించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా చూడాలని అధికారులకు ఆయన విజ్ఞప్తిచేశారు.

ప్రమాదంలో యువత భవిష్యత్తు

● ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ

ధర్మవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్తు ప్రమాదంలో పడబోతోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు, నిరుద్యోగయువత మత్తు వ్యసనాల బారిన పడుతున్నారన్నారు. గంజాయి, డ్రగ్స్ మద్యానికి బానిసై చదువులు మానేసి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ పరిసరాల్లో దాదాపు 30కిపైగా లాడ్జీలు ఉన్నాయన్నారు. వీటిలో చాలా వాటిలో సీసీ కెమరాలు లేవని, పోలీసుల పర్యవేక్షణ లేదన్నారు. గంజాయి మత్తులో యువత లాడ్జీలకు వస్తున్నారన్నారు. చీకటి ఒప్పందాల రూపంలో అనైతిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. పోలీసులు ఒకరిద్దరిపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. గంజాయి నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేయా లన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సకల రాజ, జిల్లా ఆర్గనైజర్ సెక్రటరీ కమల్‌బాషా పాల్గొన్నారు.

దేశాయి ఎందరికో స్ఫూర్తి

● ఎమ్మెల్యే కందికుంట



రెడ్డెప్పరెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

తనకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జడ్పీ మాజీ చైర్మన్, మండలంలోని పరాకువాండ్లపల్లికి చెందిన దేశాయి రెడ్డెప్పరెడ్డి మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆయన జీవితం ఎందరికో స్ఫూ ర్తిదాయకం అన్నారు. ఎమ్మెల్యే మంగళవారం రెడ్డెపప్పరెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆయన రాజకీయంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాడని కొనియాడారు. ఆయనతోపాటు టీడీపీమండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, వడ్డెర్ల సంఘం తాలూకా అధ్యక్షుడు కుంచపు గంగారాజు, టీడీపీ నాయకులు మహబూబ్‌బాషా, మునెప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి రఘువీరారెడ్డి, వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి మాజీ ఎమ్మెల్యేలు కడపల మోహన్‌రెడ్డి, అత్తార్ చాంద్‌బాషా దేశాయి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వివిధ పదవుల్లో దేశాయి రెడ్డెప్పరెడ్డి కదిరి ప్రాంతంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవా నంద్ పేర్కొన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

● ఎంపీడీఓ కార్యాలయానికి తాళం వేసి నిరసన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

గాండ్లపెంట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తాగునీటి సౌకర్యం కల్పించాలంటూ మండలపరిధి లోని దోరణాల గ్రామస్థులు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీ దోరణాల గ్రామంలో తాగునీటి బోరు తరచూ మరమ్మతులకు గురు వుతోందని తెలిపారు. దీంతో ఒక్కోసారి 15 నుంచి 20 రోజులు వరకు బోరు మరమ్మతుల పట్టించుకోకపోవడంతో ఆ గ్రామంలో ప్రజలకు మరియు పశువులకు తాగునీటి కొరత ఏర్పడుతోందన్నారు. ఇటీవల తాగునీటి బోరు మరమ్మతులకు రాగా తాత్కాలికంగా మరమ్మతులు చేయించడంతో కొద్ది రోజులకే సమస్య ఏర్పడిందన్నారు. దీంతో 10 రోజులుగా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌కు, అధికారులకు తెలియ జేసినా ఫలితం లేదన్నారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయానికి తాళాలు వేసి ఆ గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. నూతన బోరు, మోటార్ ఏర్పాటుచేస్తామని ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

ఆదాయాన్ని పెంచేందుకు

ప్రణాళికలు రూపొందించాలి

పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి సిద్ధార్థ జైన్



మరవకొత్తపల్లి వద్ద మల్బరీ పంటను పరిశీలిస్తున్న సిద్ధార్థ జైన్

చిలమత్తూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయాన్ని పెంచేందుకు పంటల వారిగా ప్రణాళికలు రూపొందించుకోవాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ కోఆపరేషన్ పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి సిద్ధార్థ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ప్రధానమంత్రి ధన్ ధన్ ధాన్య కృషి యోజన పథకం బృందంతో కలిసి మండలంలో పర్యటించారు. మరవకొత్తపల్లిలో మల్బరీ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని పెంచడంతోపాటు పంటల దిగుబడిని పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముఖ్యంగా రైతులు సాగు చేసే పంటల మధ్య గ్యాప్‌ని గుర్తించి వాటిని అధిగమించడానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పంటలో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేసే దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వం నుంచి రాయితీలతో పోషకాలు అందివ్వాలని, మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ విక్రయ కేంద్రాలు ఏర్పాటుచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, హిందూపురం ఏడీఏ కృష్ణయ్య, మండల ఏఓ కవితారాణి, హార్టికల్చర్ అధికారి మహేష్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

శాస్త్రవేత్తల సూచన.. పంటల పరిశీలన



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

సోమందేపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు ఎం శ్రీనివాసచారి, రమేష్‌నాయక్ సూచించారు. గోరంట్ల, సోమందేపల్లి మండలాల్లో రైతులు సాగు చేసిన వివిధ పంటలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ తుఫాను కారణంగా పంటలు దెబ్బతినే అవకాశంఉందన్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నీరు పొలంలో నిలబడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కందిపంటకు నీరు ఎక్కువైతే పంట దెబ్బతింటుందని పేర్కొన్నారు. పోషకాలు లభ్యంకాక మొక్క ఎదుగుదల క్షీణించిపోతుందన్నారు. ఎరువులు, యూరియాను పొటాషియం నైట్రేట్‌ను పిచికారి చేసుకోవాలన్నారు. పంట కోతదశకు వచ్చినప్పుడు వర్షాలు ఆగిపోయేవరకు కోయరాదని సూచించారు. మొగ్గదశలో వేపనూనె 5ఎంఎం నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అత్యవసర సమాచారం కోసం స్థానిక మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, వ్యవసాయ సహాయ సంచాలకుడు కృష్ణయ్య పాల్గొన్నారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించండి

- సీపీఎం నాయకుల వినతి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

చిలమత్తూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ తహసీల్దార్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నియమించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం డీటీ జగన్నాథంకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్యాలయంలో రెగ్యులర్ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్‌ఓలు లేకపోవడంతో ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. వారి సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో ఉన్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి నియమించాలని కోరారు.

గర్భిణులకు అన్నదానం

రొద్దం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రొద్దం ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులకు అన్నదానం చేశారు. మంగళవారం పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్దన్న, శంకర్, చెన్నకేశవులు, కిష్టప్ప, చంద్రశేఖర్, చిరంజీవి, లింగప్ప, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిరికెర పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 10గంటల నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖాధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినాయకనగర్, మిట్టమీదపల్లి, కె. బసవనపల్లి, వీవర్స్‌కాలనీ, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. కొత్తగా విద్యుత్‌లైను ఏర్పాటు చేస్తుండటంతో సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సోమందేపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలం మల్లాపల్లికి చెందిన నారాయణమూర్తి అనారోగ్యంతో మృతిచెందగా మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి మంగళవారం.. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని తెలిపారు. అనంతరం ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి ఏడు నర్సింహప్ప, ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

తమలపాకుకు భలే డిమాండ్

నవంబరు నుంచి ఫిబ్రవరిదాకా గిరాకీ

స్థానికంగా మార్కెట్ లేక నష్టపోతున్న రైతులు

హిందూపురం, కర్ణాటకకు తరలించాల్సిన దుస్థితి



వక్క తోటలో అంతరపంటగా సాగుచేసిన తమలపాకు

మడకశిర, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తమలపాకులకు డిమాండ్ పెరిగింది. కార్తీక మాసం కావడంతో మంచి డిమాండ్ ఉంటోందని రైతులు అంటున్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో రైతులు వక్కతోటలో అంతరపంటగా తమలపాకును సాగు చేస్తారు. కార్తీక, మాఘ, శ్రావణమాసాల్లో తమలపాకులను మంచి డిమాండ్ ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. అయితే స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి అమ్ముకోవాల్సి వస్తోందని అంటున్నారు. ఎక్కువగా హిందూపురం, దావణగెరి, చిక్కబళ్లాపురం, శిర, హిరాయూరు, పావగడ తదితర ప్రాంతాల మార్కెట్లకు తీసుకెళ్లి విక్రయించాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు. ప్రతిసంవత్సరం నవంబరు నుంచి ఫిబ్రవరి వరకు తమలపాకులకు మంచి డిమాండ్ ఉంటుందని వివరిస్తున్నారు. తమలపాకు పెండిలో నూరు కట్టల ఆకులు ఉంటాయని, ఒక పెండీ రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు ధర పలుకుతుందని అంటున్నారు. తమలపాకులు సంవత్సరంపాటు దిగుబడి ఉంటుందని, నెలకొకసారి కోతకు వస్తాయని వివరించారు. పది సంవత్సరాల క్రితం ఎకరాకు 50 పెండీలు దిగుబడి వచ్చేవని, ప్రస్తుతం రావడం లేదని పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో 1500 ఎకరాల్లో వక్క తోటలో అంతరపంటగా తమలపాకు సాగు చేస్తున్నారు. అమరాపురం మండలం నుంచి రోజుకు 100 పెండీల దాకా మార్కెట్‌కు తమలపాకులను తరలిస్తున్నారు.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి

పండించిన పంటలకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు. ఇక్కడ మార్కెట్‌సౌకర్యం లేకపోవడంతో కర్ణాటక రాష్ట్రంలోని మార్కెట్‌లకు తీసుకుని వెళ్లి అమ్ముకోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు లేకపోవడంతోపాటు రవాణా ఖర్చులు కూడా అధికం అవుతున్నాయని, స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పిస్తే తమకు సౌకర్యంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

నూరు పెండీల ఆకులు మార్కెట్లకు వెళ్తాయి..



అమరాపురం మండలం నుంచి రోజుకు 100 పెండీలదాకా తమలపాకులు హిందూపురం, కర్ణాటక ప్రాంతాల మార్కెట్లకు వెళతాయి. స్థానికంగా మార్కెట్ ఉంటే రవాణా ఖర్చులు మిగులుతాయి. ఐదు పెండీల తమలాకులు కోయడానికి కూలీల ఖర్చు 2500లు అవుతుంది. ఇక్కడ మార్కెట్‌లో ధర చూస్తే ఒక పెండీ తమలపాకులు రూ.2200 నుంచి రూ.3200 దాకా ఉంటుంది. గిట్టుబాటు కావడం లేదు. ధర కల్పించి మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

-రైతు మంజునాథ్, అమరాపురం

పురం అభివృద్ధికి మొదటి అడుగు

రూ.92.5 కోట్లు విడుదల: మున్సిపల్ చైర్మన్ రమేష్



సమీక్ష నిర్వహిస్తున్న చైర్మన్, కమిషనర్ తదితరులు

హిందూపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధికి మొదటి అడుగు పడిందని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో రూ.92.5 కోట్లు విడుదలైన సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ఎమినిటి కార్యదర్శులు, కౌన్సిలర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగుదేశం హయాంలో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.66కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని, ఆ మేరకు కొంతమేర పనులు ప్రారంభమయ్యాయన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ పనులను రద్దుచేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం అదే పనులకు సంబంధించి రూ.92.5 కోట్ల నిధులకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని త్వరలోనే పనులు ప్రారంభిస్తారన్నారు. దీంతో అన్ని వార్డుల్లో ఎక్కడెక్కడ నూతన రోడ్లు, కాలువలు అవసరమో అక్కడ నిర్మించాలన్నారు. మరో రూ.30కోట్లుకుపైగా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి త్వరలోనే నిధులు విడుదలవుతాయన్నారు. ఈ పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయన్నారు. అధికారులు స్పందించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేష్, ఎంఈ దస్తగిరి, డీఈఈలు లోకేష్, మదన్, ఏఈ జనార్దన్, శంకర్, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రమోహన్, కౌన్సిలర్ రఘు, నాయకులు అమర్నాథ్, నవీన్, పవన్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు

● పెనుకొండ డీఎల్‌పీఓ శివనారాయణ రెడ్డి



ప్లాట్లను పరిశీలిస్తున్న పెనుకొండ డీఎల్‌పీఓ శివనారాయణ రెడ్డి

చిలమత్తూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కోడూరు మన్రో తోపులో ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెనుకొండ డిఎల్‌పీఓ శివనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన కోడూరు మన్రో తోపుని సందర్శించారు. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన ఏర్పాటుచేసుకున్న చిరువ్యాపారులు దుకాణాలను కోల్పోయారు. అయితే వారు మన్రో తోపు స్థలాలను ఆక్రమించుకుంటుండంతో పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. దీంతో చిరువ్యాపారుల కోసం పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్లాట్లను కేటాయించారు. ఈ ప్లాట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. కేవలం 10 అడుగులు వెడల్పు 10 అడుగుల పొడవుతో ప్లాట్లు ఏర్పాటుచేయడం సౌకర్యంగా ఉండదని, దాటిని 20 అడుగుల వెడల్పు 20 అడుగుల పొడవుతో ఏర్పాటుచేయాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే ఊరుకునేది లేదని, అవసరమైన వారు ఈ ప్లాట్లను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఉన్నారు.

సహాయక చర్యల్లో సిబ్బంది



అమలాపురంలో పెనుకొండ ట్రాన్స్‌కో అధికారులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను సహాయక చర్యల్లో పెనుకొండ ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు. మంగళవారం కోనసీమ జిల్లా అమలాపురంలో కురుస్తున్న భారీ వర్షాలకు స్థానిక ఏఈ నారాయణస్వామితోపాటు పది మంది సిబ్బంది వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన సదస్సు



గుడ్డంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

హిందూపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గుడ్డంలో శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లవద్దకు వెళ్లి ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. సమాజంలో గౌరవంగా బతకడానికి విద్యఒక్కటే దోహదపడుతుందన్నారు. ఆడబిడ్డలను ఉన్నత చదువులు చదివేందుకు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రగతి, ఎన్ఎస్ఎస్ పీఓ రంగనాయకులు, నరసింహులు, భార్గవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లిలో దొంగనోట్లు..!



మద్యం దుకాణంలో మార్చిన దొంగనోట్లు

సోమందేపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దొంగనోట్ల చలామణి చాపకింద నీరులా విస్తరిస్తోంది. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వాల్మీకి సర్కిల్‌లోని బ్రాందీషాపు వద్ద మాటువేశారు. జనం రద్దీ ఎక్కువగా ఉండటం చూసి మద్యం కొనుగోలు చేసి మూడు రూ.500 నోట్లను అందించి చిల్లర తీసుకుని ఉడాయించారు. షాపులో పనిచేసే సిబ్బంది అవి దొంగనోట్లని గుర్తించేలోపు వెళ్లిపోయారు. ఇది కాస్త పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. షాపు నిర్వాహకులు భయంతో నోరువిప్పకపోవడం గమనార్హం. ఈ దొంగనోట్ల చలామణి కొంతకాలంగా జోరుగా సాగుతున్నట్లు ప్రచారం ఉంది. చేనేతలు అధికంగా ఉండే సోమందేపల్లిలో దొంగనోట్ల చలామణిని కొందరు ముఠా సభ్యులు ఎంచుకున్నట్లు తెలుస్తోంది. వారపుసంతలో సైతం పెద్ద ఎత్తున మార్చుతున్నట్లు సమాచారం. వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు దొంగనోట్లతో తీవ్రంగా నష్టపోతున్నారు. విషయం బయటకు చెబితే ఏం జరుగుతుందోనన్న భయంతో చాలామంది మిన్నకుండిపోతున్నారు. దొంగనోట్ల ముఠాతో కొందరు స్థానికులు చేతులు కలిపి, జోరుగా వ్యవహారం నడిపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. షాపు యజమానులు ఒకటికి రెండుసార్లు నోట్లను పరిశీలించి తీసుకుంటున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు.. దొంగనోట్ల చలామణి ముఠా ఆట కట్టించాలని స్థానికులు కోరుతున్నారు.

సామాజిక సేవను అలవర్చుకోవాలి

- కమిషనర్ సతీష్‌కుమార్



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న అధికారులు

పెనుకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు సామాజిక దృక్పథం అలవర్చుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రాయల వేసవి విడిదిగా పేరుగాంచిన గగన్మహల్ వద్ద పచ్చదనం పరిశుభ్రత చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమిషనర్‌తోపాటు మార్కెట్‌యార్డ్ చైర్మన్ బక్సంపల్లి రామకృష్ణప్ప, కళాశాల ప్రిన్సిపాల్ జయప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెనుకొండ ఓ చారిత్రాత్మక ప్రదేశమని నాటి రాయల పాలనలో నిర్మించిన అనేక చారిత్రక కట్టడాలుచూడటానికి పర్యాటకులు పెనుకొండకు వస్తుంటారన్నారు. నాటి వారసత్వ సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చారిత్రాత్మక కట్టడాలవద్ద పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు ప్రతాప్, టీడీపీ కన్వీనర్ శ్రీరాములు, రిటైర్డ్ ఎంఈఓ ప్రభంజన్‌కుమార్, మహిళ అధ్యక్షురాలు రమణమ్మ, మాజీ ఉప సర్పంచ్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు రామన్న, చంద్రమోహన్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పొలాలకు దారి చూపండి

తహసీల్దార్‌కు కోనాపురం రైతుల వినతి



తహసీల్దార్ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న జయమ్మ

పెనుకొండ రూరల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా పొలాలకు వెళ్లేందుకు దారిలేక 300 ఎకరాలకుపైగా బీడు పెట్టుకుని ఆర్థికంగా నష్టపోతున్నామని మండలంలోని కోనాపురం గ్రామ రైతులు తహసీల్దార్ స్వాతి ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. భాస్కర్, శ్రీనివాసులు, జయమ్మ తదితర రైతులు ఇదివరకు పొలాల్లో దారి లేక ఇబ్బందులు పడుతున్నామని తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ స్వాతి, సర్వేయర్ సిబ్బందితో కలిసి కోనాపురం గ్రామంలో రహదారులన్నీ పర్యవేక్షించారు. సంబంధిత రైతులకు సంబంధించిన పత్రాలు తీసుకురావాలని ఆదేశించారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విశ్వేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



పెనుకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధిచెందిన పెనుకొండలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారికి వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక మాసం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ఆలయ చరిత్రను తెలుసుకుంటున్న కర్ణాటక ఆర్టీఐ కమిషనర్

లేపాక్షి ఆలయ శిల్పకళ అద్భుతం

కర్ణాటక ఆర్టీఐ కమిషనర్ మమత

లేపాక్షి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గావీరభద్రస్వామి ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని కర్ణాటక ఆర్టీఐ కమిషనర్ మమత అన్నారు. మంగళవారం ఆమె ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవిపాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం దుర్గావీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందుకున్నారు.

పోక్సో కేసు నమోదు

హిందూపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల మహబూబ్ అసభ్యకరంగా ప్రవర్తించడంపై పోక్సో కేసు నమోదైనట్లు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. మహబూబ్ కొద్ది రోజులుగా పాఠశాల వద్దకు వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థినిని విచారించి పోక్సో కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.